క్లుప్తంగా

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు



దుర్గాష్టమి వేడుకల్లో నృత్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

నెల్లిమర్ల: పట్టణంలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో బుధవారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కూచిపూడి, భరతనాట్యంతో చేసిన నృత్యాలు అలరించారు. సంస్థ కార్యదర్శి టి.జగన్నాధరాజు అధ్యక్షతన డ్యాన్స్ టీచర్ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాల డంప్‌తో అవస్థలు



నెల్లిమర్ల-రణస్థలం రహదారిలో చనిపోయిన కోళ్లను డంప్ చేసేందుకు వచ్చిన లారీ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారిలోని ఎంబేరేయ గుళ్ల సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు కోళ్ల వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. నిత్యం ఓ లారీతో వస్తున్న వ్యక్తులు ఆయా కోళ్ల ఫారాలు వద్ద చనిపోయిన కోళ్లను సేకరించి ప్రధాన రహదారి పక్కనే డంప్ చేస్తున్నారు. దీంతో విపరీతమైన దుర్వాసన వస్తుండడంతో అటుగా ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఓ లారీలో పదుల సంఖ్యలో చనిపోయిన కోళ్లను తెచ్చి రహదారి పక్కన డంప్ చేస్తుండగా అటుగా వెళ్తున్న యువకులు అడ్డుకున్నారు. దీంతో డంప్ చేసిన కోళ్లను తిరిగి లారీలోకి వేశారు. రహదారిలో నిత్యం కోళ్ల వ్యర్థాలను డంప్ చేస్తున్నారని సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



కార్యకర్తలతో కలిసి పౌష్టికాహారానికి సంబంధించిన పోస్టర్లను అవిష్కరిస్తున్న సర్పంచ్ పైడినాయుడు

భోగాపురం: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని, అలాగే రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమ అన్నారు. మండలంలోని రావాడ గ్రామంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలను వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారానికి సంబంధించి ఏర్పాటు స్టాల్స్‌ను సర్పంచ్ అప్పురభుక్త పైడినాయుడు పరిశీలించారు. అనంతరం కార్యకర్తలతో కలిసి పౌష్టికాహార పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు మనస్వీ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు బుధవారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. జీఎస్టీ 28 శాతం నుంచి 18 శాతం వరకు తగ్గించడం వల్ల ఏసీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, డిష్ వాషర్లు వంటి 375 వస్తువులు మరింత తక్కువ ధరకు లభిస్తాయన్నారు. ఎంపీడీవో స్వరూపరాణి, నాయకులు పిడుగు వెంకటసత్యం, చందు, పాలపర్తి లక్ష్మణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి స్వరూపిణి పైడితల్లి

- పెద్ద చెరువులో అమ్మ ప్రతిరూపాలు
- వనంగుడిలో కొలువైన దుర్గమ్మ, ముత్యాలమ్మ
- అమ్మకు అద్దాల మంటపం

విజయనగరం టౌన్:

పైడితల్లి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు మూడులాంతర్లు వద్ద ఉన్న చదురుగుడికి వెళ్లడం ఆనవాయితీ. సిరిమానోత్సవం కూడా ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. కోటశక్తికి విశేష పూజలు నిర్వహిస్తారు. అయినప్పటికీ అమ్మ వెలిసింది వనంలోనే.. అప్పట్లో స్థానిక రైల్వేస్టేషన్ ప్రదేశం పూర్తిగా అటవీ ప్రాంతంగా ఉండేది. పెద్ద చెరువు దాటిన తర్వాత అంతా దట్టమైన అరణ్య ప్రాంతం. ఇదివరలో రైల్వేస్టేషన్ ప్రాంతాన్ని అన్యాయపురంగా పిలిచేవారు. ఎందుకంటే అదంతా దారిదోపిడీలకు నిలయంగా ఉండేదని నానుడి. వనంలోనే వెలిసిన ఆ పైడితల్లి ఆవిర్భావం వెనుక ఆసక్తికరమైన కథనం ఉంది.

అన్నను వారించినా...

బొబ్బిలి యుద్ధం సమయంలో రాబోయే ఉపద్రవాన్ని గుర్తించి తన అన్న విజయరామరాజును పైడితల్లమ్మ ముందే హెచ్చరించింది. యుద్ధం వద్దని చెప్పి వారించినా ఆమె మాటను అన్న పెడచెవిన పెట్టాడు. యుద్ధంలో విజయరామరాజును తాండ్ర పాపారాయుడు హతమారుస్తాడు. పెద్ద విజయరామరాజును రక్షించుకోవాలని చిన్నారి పైడితల్లి.. పతివాడ అప్పలనాయుడు సహాయంతో యుద్ధం జరిగే స్థలానికి బయలుదేరింది. వారిద్దరూ కోట దగ్గర నుంచి బయలుదేరి పెద్ద చెరువు వద్దకు వచ్చేసరికి అన్న మరణవార్త ఆమె చెవిన పడుతుంది. అన్నంటే ఎంతో అభిమానం. వాత్సల్యం ఉన్న ఆమె ఆ వార్త విని తట్టుకోలేక తాను నిత్యం పూజించే మహాశక్తిని ప్రార్థిస్తూ పెద్దచెరువులో అక్కడికక్కడే లీనమైంది.

> యుద్ధం వద్దని చెప్పినప్పటికీ చెల్లి మాటను పెడచెవిన పెట్టిన అన్న మరణ వార్తను జీర్ణించుకోలేక దట్టమైన అరణ్య ప్రాంతం పెద్ద చెరువులో చిన్నారి పైడితల్లి దుర్గలో లీనమైంది. తన సామ్రాజ్యంలో ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకునేందుకుగానూ మరలా తనను పెంచిన పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించి చెరువులోనే ప్రతిమల రూపంలో సాక్ష్యాత్కరించింది. ఇలా.. అమ్మ చరితం విన్నా... కన్నా... తెలుసుకున్నా... ఎంతో పుణ్యఫలం. నెల రోజుల పండగలో తొలేళ్ల నుంచి సిరిమానోత్సవం వరకూ ఉంటూ పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కుబడులు చెల్లిస్తారు. మహిమాన్వితమైన ఆ పైడితల్లమ్మ వెలిసింది రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలోనే...

పెద్ద చెరువులో ప్రతిరూపాలు

అదేరోజు రాత్రి పతివాడ అప్పలనాయుడు కలలో కనిపించి.. తన ప్రతిరూపాలు పెద్దచెరువులో లభ్యమవుతాయని, వాటిని తీసి ప్రతిష్ఠించి పూజలు చేయాలని ఆ తల్లి కోరింది. ఆ ప్రకారంగానే రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో బెస్తవారు సహాయంతో వెతగ్గా ఆ నీటిలో అమ్మ ఓ మెరుపులా సాక్ష్యాత్కరమిచ్చింది. వారికి తానిక్కడ ఉన్నాననే సంకేతాన్నిచ్చింది. వెంటనే వారు ఆ ప్రదేశంలో వెతగ్గా అమ్మ విగ్రహాలు లభ్యమయ్యాయి. అమ్మవారిని ప్రతిష్ఠించి గుడి నిర్మించారు. అప్పట్లో ఆ ప్రాంతమంతా దట్టమైన అరణ్యం కావడంతో వనం గుడి అని పేరు వచ్చింది. సిరిమానోత్సవాన్ని కూడా చదురు కట్టి నిర్వహించడం కోటశక్తికి పూజలు చేయడం మూలంగా చదురుగుడి వద్ద సిరిమానోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా మారింది.



వనంగుడి పైడితల్లి అమ్మవారు

వనంగుడిలో దుర్గమ్మ, ముత్యాలమ్మ

వనంగుడిలో అమ్మవారికి ఇష్టమైన దుర్గాదేవి, ముత్యాలమ్మ అమ్మవార్లు కొలువై పూజలందుకుంటున్నారు. ప్రతీ నెలా మూలా నక్షత్రం రోజున దుర్గమ్మకు, అమ్మవారికి చండీహోమం శరన్నవరాత్రుల రోజుల్లో దుర్గాదేవికి అలంకరణలు, లక్షకుంకుమార్చనలు నిర్వహిస్తారు. అమ్మవారి పాత విగ్రహానికి ఆలయం వెనుక ఉన్న ప్రత్యేక గది కట్టి నిత్యపూజలందిస్తున్నారు. చండీహోమాన్ని అమ్మవారి విగ్రహానికి ఎదురుగా నిర్వహిస్తున్నారు. సహస్ర దీపాలంకరణ గదిలో అమ్మవారికి దీపాలంకరణ జరుగుతుంది.

అమ్మవారికి అద్దాల మంటపం

2008లో వనంగుడిలోనే అమ్మవారికి విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గాదేవికి ఉన్న విధంగానే అద్దాల మంటపం ఏర్పాటు చేశారు. ఊయలలో పైడితల్లి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊంజల్ సేవలు నిర్వహిస్తారు. రోజూ పంచహారతులు అనంతరం సేవ నిర్వహిస్తారు.

అమ్మ సేవలో తరిస్తున్నా...



చిన్ననాటి నుంచి అమ్మవారి సేవలోనే తరిస్తున్నాను. నాన్న నేతేటి శ్రీనివాసరావు అకాల మరణం తర్వాత ఉద్యోగ రూపంలో మరలా అమ్మవారు అవకాశం ఇచ్చారు. ఎందరో భక్తులు అమ్మ మహిమలతో పాటూ వారికి కలిగిన మంచి పనులు గురించి నాతో అనుభవాన్ని పంచుకుంటుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. . అమ్మవారికి సేవ చేసే అదృష్టం నాకు కలగడం నా పూర్వజన్మ సుకృతం.

– నేతేటి ప్రశాంత్, అర్చకులు, వనంగుడి, విజయనగరం

బలిహరణ ప్రదేశం వద్దనే భోగం

వనం గుడిలో బలిహరణ ప్రదేశం వద్ద భోగం పెట్టడం ఇక్కడ ప్రత్యేకంగా కనిపిస్తుంది. నాడు పైడితల్లి అమ్మవారిని ప్రతిష్ఠించిన ప్రదేశం కావడమే దీనికి కారణం. పైడితల్లి అమ్మవారికి పసుపు, కుంకుమలు ఇచ్చే భక్తులు కూడా ఇక్కడే ముందుగా పసుపు, కుంకుమలు వేసి మొక్కులు చెల్లిస్తారు. అప్పట్లో ఆలయం పెద్ద చెరువుకు ఎదురుగా ఉండేది. కానీ జన సంచారం దృష్ట్యా ఆలయాన్ని దాదాపు 18 ఏళ్ల కిందట రైల్వేస్టేషన్ వైపు ముఖద్వారంగా ఉంచి ఆలయాన్ని అభివృద్ధి చేశారు. తొలుత పూజలందుకున్న విగ్రహాలు అవసాన దశకు చేరుకోవడం చిన్న తల్లి విగ్రహాలను భీమునిపట్నం సముద్రంలో వేద మంత్రోచ్చారణలతో కలిపేశారని పెద్దలు చెబుతుంటారు.

నల్ల జీడిపిక్కలతో కాంటాక్ట్ డెర్మటైటిస్

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంతో పాటు, జిల్లాలో కూడా దసరా పండగ రోజు నల్ల జీడిపిక్కలు వాహనాలు, తలుపులు, ద్వారాలపై వేలాడదీస్తూ అవి చెడు కన్ను నుంచి రక్షిస్తాయని ప్రజలు నమ్ముతారని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డెర్మాటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ కె.వెంకటచలం తెలిపారు. నల్ల జీడిపిక్కల్లో శక్తివంతమైన రెసిన్లు, అనకార్డిక్ ఆమ్లం, ఉరుషియోల్ ఉన్నాయని తెలిపారు. ఇది కఠినమైన అలర్జీ చికాకు కల్గించే కాంటాక్ట్ డెర్మటైటిస్‌కు కారణమవుతుందన్నారు. దసరా తర్వాత చాలా మంది ఈ డెర్మటైటిస్‌కు బాధితులు అవుతారన్నారు. దద్దర్లు చాలా అసౌకర్యంగా ఉంటాయని, చాలా కుటుంబాలు చాలా ఆలస్యం అయ్యేవరకు దీన్ని గుర్తించరన్నారు. ఈ దద్దుర్లు సాధారణంగా ముఖం, చేతులు, మెడపై తీవ్రమైన ఎరుపు వాపుగా కనిపిస్తాయన్నారు. తీవ్రమైన సందర్భాల్లో ఎర్రటి చారలకు దారితీస్తుందని తెలిపారు. నల్ల జీడిపిక్కలతో సంబంధం ఉన్న వారు తమ చేతులను, ప్రభావిత ప్రాంతాలను పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు.



నల్లజీడి పిక్క రసం వల్ల వచ్చే దద్దర్లు

పోరాట ఫలితంగానే కార్మికుల ఖాళీల భర్తీ



కొత్తగా చేరిన కార్మికులతో ఏఐటీయూసీ నాయకులు, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలను భర్తీ చేయాలని ఏడాదిగా సాగించిన ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటానికి ఫలితం దక్కింది. పాలకవర్గం, అధికారులు కలిసి మొత్తం 45 మంది కార్మికులను కొత్తగా నియమిస్తూ బుధవారం నుంచే విధుల్లోకి తీసుకున్నారు. ఉదయం ఉడా పార్కు వద్ద జరిగిన సమావేశంలో నియామకమైన కార్మికులు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్‌లో సభ్యులుగా చేరారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు బుగత అశోక్, ఎస్.రంగరాజు హాజరై కొత్తగా చేరిన వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఇంకా మిగిలి ఉన్న ఖాళీలను కూడా త్వరితగతిన భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



విజయనగరం ఫోర్ట్: రక్తదానం చేస్తున్న రక్తదాతలు



భోగాపురం: రక్తదానం చేస్తున్న సీహెచ్‌సీ వైద్య సిబ్బంది



విజయనగరం అర్బన్: రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణాదానమని రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు అన్నారు. స్థానిక ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో బుధవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటి మనిషి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. మహిళలు కూడా రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జి.శివకుమార్, అబ్దుల్ రవూఫ్, సుజాత గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

భోగాపురంలో..

భోగాపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని సీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. బుధవారం స్థానిక సీహెచ్‌సీలో వైద్యులు రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బందితో పాటు కొంతమంది దాతలు రక్తదానం చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బొల్లు త్రినాద్, రాధాకృష్ణ, వైద్యులు షాలిని, బ్లడ్ స్టోరేజ్ మెడికల్ ఆఫీసర్ అలేఖ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సీతం కళాశాలలో..

విజయనగరం అర్బన్: జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా స్థానిక సీతం కళాశాలలో ఎన్‌సీసీ సంయుక్త వార్షిక శిక్షణ శిబిరం సీఏటీసీ-5లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి రక్త బ్యాంక్ సహకారంతో డాక్టర్ జాహ్నవి మరియు క్యాంపు కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ తపస్ మండల్ ఆధ్వర్యంలో ఈ శిబిరం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఎన్‌సీసీ కేడెట్లు అధికారులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా 100 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ జి.భద్రయ్య, సుబేదార్ ఆలేటి చంద్రరావు, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్ సత్యవేణి, లెఫ్టినెంట్ ప్రశాంత్, లెఫ్టినెంట్ కృష్ణ కిషోర్, సీఎస్‌వో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సొంత జిల్లాలోనే మహిళలకు రక్షణ కరువు

నెల్లిమర్ల రూరల్: సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే మహిళలకు రక్షణ కరువైందనేందుకు దళిత బాలికపై జరిగిన ఘటనే నిదర్శనమని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టొంపల నరసయ్య, ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీనివాసరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం వారు మాట్లాడుతూ ఇటీవల పెనుమూరు క్రాస్ రోడ్డులోని అటవీ శాఖ వనంలో బాలికను టీడీపీకి చెందిన వ్యక్తులు బెదిరించి లైంగిక దాడి చేయడం అమానుషమన్నారు. ప్రతిఘటించిన బాలిక స్నేహితుడిని సైతం తీవ్రంగా కొట్టారన్నారు. అత్యాచారం చేయడమే కాకుండా ఫోన్లో చిత్రీకరించడం బాధాకరమన్నారు. హోంమంత్రి తక్షణమే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, చట్టాలని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చదువుతో పాటు క్రమశిక్షణను నేర్పాలి



గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేత

విజయనగరం: చదువుతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణను కూడా చిన్నప్పటి నుంచి తల్లిదండ్రులు నేర్పాలని రోటరీ క్లబ్ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో బుధవారం జరిగిన రోటరీ నవతరోత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నెల రోజుల పాటు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ క్లబ్బులు ప్రతి ఏడాది నిర్వహించే పోటీలు విద్యార్థులకు పోటీతత్వాన్ని, క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అగర్వాల్, కార్యదర్శి ఉదయ్‌కుమార్, ప్రతినిధులు ఆర్.శంకర్ రాజేష్, రెడ్డి, టి.ఎల్.ఎన్.మూర్తి, కాపుగంటి ప్రకాష్, కృష్ణతేజ, చెన్నా ప్రదీప్, రోహిత్ సంజయ్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అన్న సమారాధన

పూసపాటిరేగ : మండలంలోని గోవిందపురంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించింది. ముందుగా దుర్గాదేవి ఉత్సవ కమిటీ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు మాంసాహార విక్రయాలు నిషేధం

విజయనగరం: అక్టోబరు 2 గాంధీ జయంతి సందర్భంగా విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మాంసం విక్రయాలు బంద్ చేయాలని కమిషనర్ పల్లి నల్లనయ్య బుధవారం ప్రకటించారు. పశువధలుగాని, మాంసం విక్రయాలుగాని చేయరాదని తెలిపారు. ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించి మాంసం విక్రయాలు జరుగుతున్నట్టు గుర్తించినట్లయితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మాంస విక్రయాల నియంత్రణకై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.

నెల్లిమర్ల: పట్టణంలో గురువారం మాంసాహార విక్రయాలు నిషేధిస్తున్నట్టు నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా స్థానిక హోటళ్లు, రెస్టారెంట్లలో చేపలు, మాంసం, గుడ్లు తదితర మాంసాహార విక్రయాలు జరపరాదని ఆదేశించారు. అలాగే చికెన్, మటన్, చేపలు దుకాణాలు తెరవవద్దని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ సమస్యల పరిష్కారానికి రీసర్వే

నెల్లిమర్ల రూరల్: ఏళ్ల కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి జరిపిస్తున్న రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. మండలంలోని అలుగోలు సచివాలయంలో భూముల రీసర్వేపై బుధవారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి అలుగోలులో సుమారు 2,200 ఎకరాల్లో భూముల రీసర్వే ప్రారంభిస్తున్నామని, రైతులు సంబంధిత పత్రాలను సర్వే సిబ్బందికి చూపించి సహకరించాలన్నారు. రీసర్వేతో రైతుల భూ విస్తీర్ణం, హద్దులు, తదితర సమస్యలు పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, ఆర్ఎస్‌డీటీ సత్యనారాయణ, గ్రామ పెద్దలు దివాకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా దుర్గాదేవి



విజయనగరం టౌన్: శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కొలువైన మహాగౌరీ అమ్మవారికి 51 రకాల పిండి వంటల నైవేద్యం



విజయనగరం టౌన్: వనంగుడిలో మహిషాసురమర్దినిగా దుర్గాదేవి

శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విజయనగరం రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో కొలువుదీరిన దుర్గాదేవి బుధవారం మహిషాసుర మర్థినిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలుచోట్ల శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వేర్వేరు రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



డెంకాడ: దీపాలంకరణలో అమ్మవారి రూపం తయారు చేసిన భక్తులు

ఐసీడీఎస్ ఆవిర్భావ దినోత్సవం

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గ్రామంలో ఐసీడీఎస్ ఆవిర్భావ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆవిర్భవించి నేటికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంతో పాటు, గాంధీ జయంతిని పురస్కరించుకుని ద్వారపూడి సెక్టార్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలోని తల్లుల సమక్షంలో విజయనగరం అర్బన్ సీడీపీవో ప్రసన్నకుమారి ఆదేశాలతో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీలో ప్రీస్కూల్ ఈసీసీఈ కార్యక్రమాలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం ఆవశ్యకత, పిల్లలకు పెరుగుదలకు తీసుకోవలసిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ పర్యవేక్షకురాలు పైడితల్లి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వాడబోయిన బుజ్జి, కె.పద్మావతి, వై.పద్మ చల్లపేట కార్యకర్తలు ఎ.గౌరీ, పార్వతి, తల్లులు ప్రీ స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.